క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కారెంపూడి: కారెంపూడి ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.నయోమి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 22వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంగ్లీస్ మీడియం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో.. పదవ తరగతిలో మార్కుల మెరిట్ ఆధారంగా, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆదర్శ పాఠశాలల వెబ్ సైట్‌లో లేదా పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి దేవాలయ ప్రతిష్ట



మాచవరం: మండలంలోని పిన్నెల్లి గ్రామం వాల్మీకి బోయ కాలనీలో వాల్మీకి మహర్షి విగ్రహ, దేవాలయ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. గ్రామానికి చెందిన దంపతులు పీటలపై కూర్చుని, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామస్తులు వాల్మీకి మహర్షి విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాల్మీకి బోయ సంఘ నాయకులు మాట్లాడారు. వాల్మీకి మహర్షి గొప్పతనాన్ని కీర్తించారు. గ్రామంలో సంఘటితంగా ఉండి దేవాలయం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

రైతు సంక్షేమం లక్ష్యం

మాచర్ల: ఆంధ్రప్రదేశ్‌ను సీఎం వైఎస్ జగన్ రైతు రాజ్యంగా తీర్చిదిద్దారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వారు పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఆర్బీకేలు ఏర్పాటు చేసి, అగ్రి టెస్టింగ్, యంత్ర సేవ పరికరాలు, హార్టి కల్చర్‌కు భారీ స్థాయిలో నిధులు కేటాయించినట్లు తెలిపారు. రైతు భరోసా, పంటల బీమా, వడ్డీ రుణం, వైఎస్సార్ యంత్ర సేవ పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ తదితరాలను వివరించారు. మాచర్ల నియోజకవర్గంలో రూ.205 కోట్లు రైతులకు మేలు జరిగిందన్నారు. రైతలు సంక్షేమం కోసం నిరంతరం పాడుపడుతున్నట్లు చెప్పారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి



దాచేపల్లి : లారీ ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కారెంపూడి మండలం భట్టువారిపల్లెకు చెందిన సరికొండ మహా లక్ష్మమ్మ(58)స్థానిక కేసానుపల్లి సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయం కావటంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల సమాచారంతో ఘటన స్థలాన్ని సీఐ ఎ.సురేంద్రబాబు, ఎస్‌ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు మిర్యాలగూడెంలోని కుమారుడి వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుందని సీఐ సురేంద్రబాబు తెలిపారు.

విధుల నుంచి వలంటీరు తొలగింపు

కారెంపూడి: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన కారెంపూడి-2 సచివాలయం వలంటీర్ షేక్ మౌజుబిని విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియాలో ఆమె వాట్సాప్ స్టేటస్ ద్వారా రాజకీయ పార్టీ నాయకుల ఫొటోలను, వీడియోలను షేర్ చేసినందుకు గాను ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

నిషేధిత చేపల వలలు స్వాధీనం



మాచవరం: తాడుట్ల రెవెన్యూ శివారులోని పాత వెల్లంపల్లి గ్రామ ముంపు ప్రాంతాల్లో కృష్ణా నదిలో చేపల వేటకు ఉపయోగిస్తున్న రెండు నిషేధిత వలలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా మత్స్యా శాఖ అధికారి ఎస్.సంజీవరావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన దాడుల్లో గోరె శ్రీనివాసరావు, మొగావత్ బిక్షు నాయక్ అనే ఇద్దరి నుంచి రెండు పెద్ద వలల స్వాధీనం చేసుకొని, మాచవరం పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు. ఇద్దరిపై పోలీసులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేదిత చేపల వలల ఉపయోగించడం నేరమని, వేటకు ఉపయోగిస్తే అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయ పర్యవేక్షకలు టీవీపీ శ్రీనివాసరావు, పిషరీస్ అసిస్టెంట్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

పవిత్రం మట్టల ఆదివారం



సాగర్‌మాత దేవాలయ ప్రాంగణంలో..

రెంటచింతల: మండలంలో మట్టల ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక కానుక మాత చర్చి ఆవరణలో విచారణ గురువులు ఫాదర్ ఏరువ లూర్ధుమర్రెడ్డి, సహాయ గురువులు అగస్టీన్ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఏసు క్రీస్తు జీవితంలోని చివరి ఘట్టాలను, కథోలికులందరూ ఈస్టర్‌కు ముందు ఈ మట్టల ఆదివారం పవిత్రంగా భావించి, సంపూర్ణ భక్తి విశ్వాసంతో ప్రార్థించాలన్నారు. యహోవా దేవుని కుమారుడైన ఏసు క్రీస్తు మానవాళి రక్షణకు శిలువమరణం పొందారని వివరించారు. ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో పాస్టర్ కటికల ఏసుదానం, భక్తులకు మట్టల ఆదివారం ప్రత్యేకతను వివరించారు. తుమృకోట ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో దేగల యోహాస్ మాజీ బిషప్ తూర్పు సినడు ఆధ్వర్యంలో, పాలువాయి, మంచికల్లు, పశర్లపాడు, రెంటాల, జెట్టిపాలెం తదితర గ్రామాల్లోని ప్రార్థన మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక పార్థనలు చేసి, మట్టల ప్రత్యేకతను వివరించారు. ఆశీర్వదించిన తాటి, ఈత మట్టలను భక్తులకు పంపిణీ చేశారు. మట్టలను తీసుకున్న భక్తులు క్రైస్తవ భక్తి గీతాలు ఆలపించారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

విజయపురిసౌత్: స్థానిక విజయపురిసౌత్‌లోని చర్చిల్లో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే భక్తులు, చిన్నారులు స్నానాలు ఆచరించి, ఈత మట్టలను వివిధ రకాల పూలతో అలంకరించి చర్చిలకు చేరుకున్నారు. స్థానిక సాగర్ మాత ఆలయంలో భక్తులు ఈత మట్టలను చేత బూని ఆలయం చుట్టూ తిరుగుతూ దేవునికి స్తుతులు, స్తోత్రాలు అర్పించారు. అనంతరం తేరు ప్రదక్షణ చేశారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఏసుక్రీస్తు మరణం ప్రాముఖ్యతను, పునరుత్థానుడైన విషయాలను బోధించారు. స్థానిక లూథరన్ చర్చి నుంచి చిన్నారులు ఈత మట్టలతో గ్రామంలోని వీధుల్లో ఏసుక్రీస్తు భక్తి గీతాలు ఆలపిస్తూ తిరిగారు.

నిష్కలంకంగా జీవించాలి

దాచేపల్లి : ప్రతి ఒక్కరు పాపాలను విడిచి నిష్కలంకంగా జీవించాలని పాస్టర్ గనుపల్లి శ్యాం ప్రసన్న కుమార్ సందేశమిచ్చారు. మట్టల ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సండే స్కూల్ విద్యార్థులు, విశ్వాసులతో కలిసి మండల వ్యాప్తంగా ర్యాలీలు చేశారు. క్రీస్తు శిలువ మరణం గురించి ప్రజలకు వివరించారు. కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో జరిగిన ప్రత్యేక ప్రార్ధనలో పాస్టర్ శ్యాం ప్రసన్నకుమార్ ప్రసంగించారు. ఈ కార్యక్రమాల్లో పాస్టర్లు మాచర్ల మోజేష్, కేఎస్. డేవిడ్‌రాజు, కుమార్, ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



కేసానుపల్లిలో మట్టలతో ర్యాలీ..

ఘనంగా మట్టల పండగ

మాచర్ల: పట్టణంలోని ఆయా చర్చిల ఆధ్వర్యంలో మట్టల పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. ప్రధాన రహదారిలోని ఆంధ్రా ఇవాంజిలికల్, లూథరన్ చర్చి పాస్టర్ ఐజయ్య ఆధ్వర్యంలో ఈత మట్టల ర్యాలీని భక్తులు నిర్వహించారు. దావీదు తనయ అంటూ క్రీస్తును స్తుతించారు. తెలుగు బాప్టిస్టు చర్చి పాస్టర్ రవికుమార్, పాస్టరమ్మ నాగేంద్ల విక్టోరియా రాణిల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ జరిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. బేతేలు మందిరంలో పాస్టర్ జాన్‌వెస్లి ఆధ్వర్యంలో మట్టల పండుగ ఘనంగా జరిగింది. ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి, మట్టల ర్యాలీ నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. న్యూ ఇవాంజికల్ లూథరన్ చర్చి మట్టల పండగను నిర్వహించి, ఏసుక్రీస్తు సందేశాన్ని అందించారు.



బెరాక ప్రార్థన మందిరంలో ఎమ్మెల్యే పిన్నెల్లి ప్రార్థనలు



మాచర్ల పట్టణంలో ర్యాలీ లూథరన్ చర్చి పెద్దలు

మట్టల పండగలో ఎమ్మెల్యే పిన్నెల్లి

మాచర్ల: గుడ్ ఫ్రైడే నెలలో మట్టల పండగను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని బెరాకా ప్రార్థన మందిరంలో పాస్టర్ టైటాస్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆయన మట్టల పండుగ, గుడ్ ఫ్రైడే గురించి భక్తులకు వివరించి ఏసుప్రభువు ఆశీసులందుకున్నారు. పలువురు పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

మాచర్ల రూరల్: ఓటర్లకు కనీస మౌలిక సదుపాయాలను పోలింగ్ కేంద్రంలో కల్పించాలని, ఇందుకు అధికారులు సమష్టిగా పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రాయవరం, కొత్తపల్లి, కొప్పునూరు, అలుగురాజుపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యంతో పాటు తాగునీరు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ప్రజలకు టెంట్లు, వీల్ చైర్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించటంలో మండల ప్రజా పరిషత్, విద్యుత్, రెవెన్యూ ఇతర శాఖలు సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని రకాల భద్రత, వసతులు కల్పించడంపై జేసీ శ్యాంప్రసాదు గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దారు మంజునాథరెడ్డి, ఎంపీడీఓ సరోజనీదేవి, ఎస్ఐలు రాజశేఖర్, కొండారెడ్డి, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, ఎన్నికల డీటీ షేక్ బాషా, ఏఎస్ఓ ప్రభాకర్, ఆర్ఐ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ షేక్ మస్తాన్ వలి తదితరులున్నారు.



రాయవరం పోలింగ్ కేంద్రం పరిశీలన జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మాచర్ల: పట్టణ శివారులోని జాతీయ రహదారి మీదగా వెల్దుర్తి నుంచి మాచర్ల వస్తుండగా ఓ వ్యక్తి ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీ కొట్టడంతో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివిధ కూలీ పనుల నిమిత్తం పట్టణంలోని కోడెల శివప్రసాద్ కాలనీకి చెందిన షేక్ ఇస్మాయిల్ (38) తన స్నేహితులతో ద్విచక్ర వాహనంపై వెళ్తుంటాడు. పట్టణ శివారులోని శ్రీశైలం రోడ్డులో ఆంజనేయ స్వామి గుడి ఎదురు డివైడర్‌ను ఢీ కొని అక్కడికక్కడే మృతిచెందాడు. అతని స్నేహితుడికి ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని పట్టణ సీఐ శరత్‌బాబు సందర్శించి, విచారణ జరిపారు. అనంతరం కేసు నమోదు చేశారు. మృతుడు ఇస్మాయిల్‌కు భార్య, కుమారుడు, కుమార్తెలున్నారు.

పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని ఖలీల్ డాబా వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు.. పిడుగురాళ్ల నుంచి బ్రాహ్మణపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొనడంతో రోడ్డుపై పడి తలకు బలమైన గాయం అయ్యింది. దీంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు, ఆటోలో ప్రయాణిస్తున్న మహిళకు గాయాలు కావడంతో నర్సరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 35 సంవత్సరాలు ఉండవచ్చని, మృతుని వివరాలు తెలియాల్సి ఉందని పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడు తెల్ల చొక్కా, నల్లప్యాంటు ధరించి ఉన్నాడని, వివరాలకు పిడుగురాళ్ల పోలీస్‌స్టేషను సంప్రదించాలని ఎస్ఐ రబ్బాని ఖాన్ తెలిపారు.

సంఘం పునర్వైభవానికి కృషిచేయాలి

ఆర్యవైశ్య యువజన సంఘం తాజా మాజీ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: ఆర్యవైశ్య యువజన సంఘం గత వైభవాన్ని పునరుద్ధరించేందుకు నడుం బిగించాలని, సంఘాన్ని రాజకీయాలకు అతీతంగా నడపాలని ఆర్యవైశ్య యువజన సంఘం తాజా మాజీ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆర్య వైశ్య యువజన సంఘం నూతన అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్ అధ్యక్షతన తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్ మాట్లాడుతూ ఆర్యవైశ్య యువజన సంఘం పూర్తి కార్యవర్గాన్ని నియమించుకుని త్వరలో ప్రమాణ స్వీకారం చేస్తామన్నారు. ఎక్కువ మంది యువతను ఆకర్షించి సంఘాన్ని బలోపేతం చేస్తానని తెలిపారు. రాజకీయాలు వేరు , సంఘం వేరన్నారు. అనంతరం పెండ్యాల సందీప్, దివ్వెల సతీష్‌కుమార్, కొప్పురావూరి ప్రసాద్, త్రిపురమల్లు శ్రీనివాసరావు, దేవరశెట్టి సైదారావును సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు నారాయణ వెంకటరత్నం, శ్రీనివాసరావు, లఘుమవరపు రమేష్, భవిరిశెట్టి రంజిత్, పెరుమాళ్ల అమర్, సంపత్, సతీష్, రాజా, సాయి చరణ్, మౌర్య, సాయి, వెంకటేష్, చంద్ర, న్యాయవాదులు పొత్తూరి హరి మణికంఠ, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న వారితో కొత్త రామకృష్ణ, చిల్లంచర్ల కల్యాణ్ తదితరులు

సర్వస్వతి శిశుమందిరాలు క్రమశిక్షణకు నిలయాలు

సత్తెనపల్లి: శ్రీ సర్వస్వతి శిశుమందిర్ పాఠశాలలు బోధనతో పాటు క్రమశిక్షణకు నిలయాలు అని జిల్లా కార్యదర్శి కె. శంకరరావు అన్నారు. పట్టణంలోని శ్రీ సర్వస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పోషకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల ప్రబంధకారిణి కార్యదర్శి గణపరపు రంగారావు, పెండ్యాల హరేరామ్, విప్పర్ల సాంబశివరావు, పాఠశాల జాయింట్ సెక్రటరీ కటకం పద్మావతి మాట్లాడారు. విద్యార్థిని విద్యార్థులకు సంస్కృతి జ్ఞాన పరీక్ష సర్టిఫికెట్స్‌తో పాటు కటకం పద్మావతి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల ప్రధానాచార్యులు ధనలక్ష్మి మాతాజీ పాల్గొన్నారు.

నిరంతరం నీటి సరఫరా

గురజాల : నగర పంచాయతీ పరిధిలోని బంగ్లా సెంటర్‌లో నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నామని శనివారం రాత్రి బిందెలతో పలువురు రోడ్డెక్కారు. నిత్యం ఆ ప్రాంతానికి 8 ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు మునిసిపల్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఈచర్య వెనుక తెలుగుదేశం పార్టీ కుటీల రాజకీయాలకు తెరలేపిందని స్థానికులు విమర్శిస్తున్నారు. నగర పంచాయతీ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు కలిసి నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి, మొదటి నుంచే ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. నగర పంచాయతీ సిబ్బంది నిత్యం ఆ ప్రాంతానికి 8 ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకుడి దాడి

పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన ఘటనలో పలువురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ రబ్బాని ఖాస్ తెలిపారు. వివరాల మేరకు.. మండలంలోని గుత్తికొండ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మాబు సుభాని పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకొని, డబ్బులు ఇచ్చే విషయంలో కుంబా అనిల్‌తో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో సుభాని అతని అనుచర వర్గాన్ని పిలిపించి, అనిల్, అన్న ఆనందకుమార్‌తో పాటు మరో ముగ్గురిపై దాడి చేశారు. కులం పేరుతో దూషించారు. దీంతో కుంబా అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పులిహోర పంపిణీ

దుర్గి: శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా మండలంలోని ఓబులేశునిపల్లె గ్రామంలో హాజరైన భక్తులకు స్థానిక యాదవ్ యూత్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. ఆదివారం అమ్మవారి జాతర సందర్భంగా వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. భక్తులకు అవసరమైన పులిహోర, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేసి తమ భక్తిని చాటుకున్నారు.

ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల వెంకట్రామయ్య మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలకు పైగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు రాత్రి వరకు నిరంతరంగా పంపిణీ చేస్తామన్నారు.

వేంకటేశ్వరునికి లక్ష మల్లెపూల పూజ



ప్రత్యేక పూజలో స్వామి

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ రామాలయం, శ్రీ వెంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో ఫాల్గుణ పూర్ణిమి సందర్భంగా 108 మంది మాతృమూర్తులుతో లక్ష మల్లెపూల పూజ ఆదివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు పులిపాటి శ్రీరామమూర్తి, భుజంగరావు, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, సీతయ్య, సీతారామాంజనేయులు, వసంతరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 50 కుటుంబాల చేరిక

పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నవరత్నాల సంక్షేమ పథకాలకు ఎంతో మంది ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణంలోని క్రిస్టియన్ పేట 17, 18 వార్డులకు చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరాయి. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా సంక్షేమం , అభివృద్ధి జరిగిందని, గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మీసాల మాణిక్యరావు, వై.కోటయ్య, వై.మాణిక్యరావు, ఏసుపొంగు ఏసయ్య, సుంకరి కెనడి, చౌటపల్లి నాగేశ్వరావులతో పాటు మరి కొందరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, వైఎస్సార్ సీపీ నాయకులు చల్లగుండ్ల మరియదాసు, మందా సుదీర్, మందా, జాషువా, బంకా అనిల్, మాచర్ల వెంకట్, జోగిపర్తి ముక్కంటేశ్వరరావు, పసుపులేటి ఆనంద్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

విశ్వబ్రాహ్మణులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంది

ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: విశ్వ బ్రాహ్మణలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని శుభమస్తు కల్యాణ మండపం నందు రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కుందుర్తి లక్ష్మీకుమారి అధ్యక్షతన నియోజకవర్గస్థాయి విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాసు మహష్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణలను గుర్తించి, వారికి రాజకీయంగా ఉన్నత పదవులు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి, గుర్తింపునిచ్చినట్లు తెలిపారు. గురజాల నియోజకవర్గంలో రాష్ట్రస్థాయి పదవితో పాటు అనేక పదువులు విశ్వ బ్రాహ్మణులకు ఇవ్వడం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే 30 సెంట్లలో విశ్వ బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల్లో చేసి చూపిస్తామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్తా సుబ్బారావు, కౌన్సిలర్లు, మురలీకృష్ణ , నాగరాజు, ప్రావతి, లింగాచారి, రామాంజినేయులు, కొమ్ము ముక్కంటి, శ్రీనివాసాచారి, బ్రహ్మాచారి, రాంప్రసాద్, లింగాచారి, ఆంజినేయులు, నాసరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ఘనంగా నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి తిరునాళ్ల

దుర్గి: పల్నాటి ప్రాంతంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.

లక్షలాది మంది భక్తులు తెల్లవారు ఝాము నుంచే అమ్మవారిని దర్శించుకొని, పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయగా దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు దర్శించి, తరించారు. అమ్మవారి తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు రాజకీయ నాయకులు, అధికారులు దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పలు గ్రామాల నుంచి కుంకుమ బండ్లను ఏర్పాటు చేసి, అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.



ఆలయానికి తీసుకొస్తున్న కుంకుమ బండ్లు

క్షయపై అవగాహన కల్పించాలి

రెంటచింతల: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు నర్రా కృష్ణారెడ్డి, కె.ప్రదీప్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మెడికల్ ఆఫీసర్లు ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో క్షయ బారి నుంచి రక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి మాట్లాడారు. మూడు వారాల పాటు దగ్గు, ఆయాసం, నోటిలో నుంచి పసుపు రంగు కళ్లె పడటం, బరువు తగ్గడం , ప్రతిరోజు సాయంత్రం జ్వరం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి కళ్లె పరీక్ష చేయించుకోవాలని సూచించాలన్నారు. క్షయ అంటువ్యాధి అని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. డాట్స్ విధానం ద్వారా ప్రభుత్వమే క్షయవ్యాధి నివారణకు ఉచితంగా మందులు అందజేస్తుందని వివరించారు. అనంతరం ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో పీహెచ్‌సీ నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలలో అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్ వైజర్ ఎస్.కోటేశ్వరరావు, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన కలిగిఉండాలి

గురజాల : క్షయపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గురజాల టీబీ యూనిట్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ షేక్ రేష్మ సూచించారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం పురస్కరించుకుని మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గంగవరం వద్ద ఉన్న వృద్ధాశ్రమం, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్షయ బాధితులు ఎటువంటి ఆహారం తీసుకోవాలి, ఏ విధంగా కోలుకోవాలని అన్న విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.నాగరాజు, అల్లం శ్రీనివాసరావు తదితరులున్నారు.



రెంటచింతల పీహెచ్‌సీ నుంచి ర్యాలీగా..

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

అచ్చంపేట: స్థానిక వాగు ఒడ్డున శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారు, గణపతి, ఆంజనేయ, నాగేంద్రస్వామివార్ల విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంత కుమారి పాల్గొన్నారు. శనివారం రాత్రి జరిగిన ఈ మహోత్సవాలలో వసంతకుమారి దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ఆమె చల్లని చూపులతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వైభవంగా దేవాలయం, ధ్వజ స్తంభ ప్రతిష్ట

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురిలో శ్రీ భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి నూతన దేవాలయం, ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆడపడుచులు, బంధుమిత్రుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతిష్ట మహోత్సవంలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com